ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 40.3 / కనిష్టం 24.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 14 మే 2024

జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిపోవడంతో ఇక అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గత నెల రోజులుగా గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోయినా.. అభ్యర్థుల భవితవ్యం జూన్ 4న తేలనుంది. ఓటర్ల మదిలో ఏముందో తెలుసుకునేందుకు మరో 21 రోజుల పాటు వేచిచూడాల్సి ఉంది. దీంతో అభ్యర్థులతో పాటు రాజకీయవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ ముగిసిపోయినా.. ఫలితం తేలేందుకు ఎక్కువ సమయం ఉండడంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నాళ్లు అందరికీ జై కొట్టిన ఓటర్లు.. చివరకు ఎవరి వైపు మద్దతుగా నిలుస్తారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలో ఏ నలుగురు కలిసినా.. పోలింగ్ సరళిపైనే చర్చించుకోవడం కనిపిస్తుంది. ఏవర్గం ఓటర్లు ఎటువైపు మద్దతుగా నిలిచారన్న చర్చ సాగుతోంది. అభ్యర్థులు పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు.



పట్టణంలో సెల్ఫీ పాయింట్ వద్ద ఓటు వేసినట్లు చూపుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు


● ఓటు వేసినట్లు చూపుతున్న ఆదివాసీ ఓటర్లు


నేరడిగొండ మండలం లింగట్ల పోలింగ్ కేంద్రానికి ఆరు నెలల చిన్నారితో వచ్చి ఓటు వేసిన మహిళ

పోలింగ్‌కు.. పో(టె)త్తారు!

- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్
- గత ఏడాది కంటే ఈయేడు భారీగా పెరిగిన ఓటింగ్ సరళి
- ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 69.81 శాతం పోలింగ్ నమోదు
- ఈవీఎంలలో నిక్షిప్తమైన ఆయా పార్టీల అభ్యర్థుల భవితవ్యం
- అంతటా చల్లబడిన వాతావరణం.. బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు.. ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ
- పలు గ్రామాలలో పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించిన ఓటర్లు
- ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి
- ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు ప్రముఖులు
- గెలుపు ధీమాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు




● ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు









ఆదిలాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. ఈసారి ఎండల తీవ్రత కారణంగా పోలింగ్ సమయాన్ని గంట పాటు పెంచారు. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కఠినమైన నిబంధనలు విధించారు. దీంతో పలు పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలాంటి ఇతర వస్తువులను అనుమతించ లేదు. ఎన్నికల నిబంధనలపై అవగాహన లేని కొంతమంది ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. వేసవి కాలం కావడంతో ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నీడ సౌకర్యంతో పాటు నీటివసతిని కల్పించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 16లక్షల 50వేల 175మంది ఓటర్లు ఉండగా.. సర్వీసు ఓటర్లను కలుపుకొని 16లక్షల 52వేల 394 ఓటర్లు ఉన్నారు. మొత్తం 2,200 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలో 69.81 శాతం (సాయంత్రం 5గంటల వరకు) పోలింగ్ నమోదైంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 69.82 శాతం కాగా, బోథ్ నియోజకవర్గంలో 74.8 (సాయంత్రం 5గంటల వరకు) శాతం పోలింగ్ నమోదైంది. గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పార్లమెంట్ పరిధిలో 62.44 పోలింగ్ శాతం నమోదైంది. ఈసారి పోలింగ్ శా తం భారీగా పెరిగింది. ఎందుకం టే ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లబడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చారు. జిల్లా కేంద్రంలోని పిట్టలవాడ, రాంగనర్, వడ్డెరకాలనీ, ఉట్నూర్ పోలింగ్ కేంద్రాలలో పలువురు ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తానికి జిల్లా వ్యాప్తంగా చిన్న పాటి సంఘటనలు మినహా.. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే ముగిసింది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా, సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్‌తో కలిసి పరిశీలించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

పెరిగిన పోలింగ్ శాతం

గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం భారీగా పెరిగింది. దీంతో పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలమనే చర్చ సాగుతోంది. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు 13.22 శాతం పోలింగ్ నమోదైంది. 9 గంటల నుంచి 11 గంటల వరకు భారీగా పెరిగిన పోలింగ్ 31.51 శాతానికి చేరుకుంది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 50.18 శాతం పోలింగ్ నమోదు కాగా, 1గంట నుంచి 3గంటల వరకు 62.44 శాతం, మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు 69.81 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉదయం 2గంటల పాటు కొంత మందకోడిగానే సాగిన పోలింగ్ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఊపందుకోవడంతో పోలింగ్ శాతం భారీగా నమోదైంది. వాతావరణం సహకరించడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు కిలోమీటర్ల మేర కాలినడక న వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిరికొండ మండలం తిమ్మాపూర్ గ్రామం నుంచి సుమారుగా 2కి.మీ.ల దూరంలో ఉన్న రిమ్మ గ్రామానికి వెళ్లి ఆదివాసీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇలా పలు మారుమూల గిరిజన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు దూరమైనా.. ఓటు వేసేందుకు ఆదివాసీలు ఉత్సాహాన్ని కనబర్చారు.

ఆలస్యంగా పోలింగ్

జిల్లావ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా.. కొన్ని చోట్ల కొంత ఆలస్యంగా పోలింగ్ మొదలయ్యింది. ఈవీఎంలను పరిశీలించిన అనంతరమే ఎన్నికల సిబ్బందికి అందజేసినా.. పోలింగ్ సమయంలో కొద్దిసేపు మొరాయించాయి. ఆదిలాబాద్ పట్టణంలోని షాదిఖానా(265), బాలక్‌మందిర్ (285) పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే అధికారులు వాటి స్థానంలో కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేశారు. అలాగే బోథ్ మండలం కౌట(బి) పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో ఒక ఈవీఎం మొరాయించడంతో దాని స్థానంలో మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని 36వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పలు గ్రామాలలో ఎన్నికలను బహిష్కరించారు. బజార్‌హత్నూర్ మండలం మన్కపూర్ గ్రామానికి సరైన రోడ్డు మార్గం, సెల్ టవర్ లేకపోవడంతో ఆ గ్రామస్థులు ఓటు వేసేందుకు నిరాకరించారు. దీంతో విషయం తెలుసుకున్న అధికారులు హామీ ఇవ్వడంతో ఆలస్యంగా.. తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. అలాగే ఇచ్చోడ మండలం బావోజీపేట గ్రామానికి సరైన రోడ్డు మార్గం, త్రిఫేజ్ కరెంట్ సరఫరా లేదంటూ బ్యానర్లను ఏర్పాటు చేసి ఎన్నికలను బహిష్కరించా రు. జిల్లా కలెక్టర్ చొరవతో ఆలస్యంగా తిరిగి గ్రామస్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గెలుపుపై ధీమా కనిపిస్తోంది. తమ పార్టీ నేతలు, సన్నిహితుల ద్వారా పోలింగ్ సమాచారాన్ని సేకరిస్తూ గెలుపు అంచనాలను వేసుకుంటున్నారు. నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లను లెక్కలు వేసుకుంటూ గెలుపు ఖాయమని ధీమాతో కనిపిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో బీజేపీకి కొంత హవా కనిపించింది. గ్రామీణ, మండల స్థాయిలో కాంగ్రెస్, బీజేపీలు తలా కొన్ని ఓట్లను దక్కించుకున్నాయి. అన్నిచోట్ల బీఆర్ఎస్ మాత్రం డీలా పడిపోయినట్లు కనిపించింది. ఎన్నికల వరకు మూడు ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ కనిపించినా.. పోలింగ్ రోజు బీఆర్ఎస్ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడం కనిపించింది. దీంతో బీజేపీ బలపడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యువత, విద్యావంతులు, ఉద్యోగులు.. 'ఫిర్ ఏక్ బార్ మోదీ' అనే నినాదంతో ఓటు వేసినట్లు తెలుస్తోంది. మహిళలు, వృద్ధులు, రైతులు అధికార కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపినట్లు అర్థమవుతుంది. పోలింగ్ శాతం కూడా పెరగడం బీజేపీకి కొంత అనుకూలంగానే మారిదంటున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం స్థానిక బొక్కలగూడ, అజీజియా ఉర్దూ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అలాగే జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పట్టణంలోని మహాలక్ష్మివాడ, ఖానాపూర్, కేఆర్‌కే, హిందీ హైస్కూల్, తిర్పెల్లి, హమాలీ వాడ, మార్కెట్‌యార్డు, దస్నాపూర్ పోలింగ్ కేంద్రాలతో పాటు పొన్నారి, సుంకిడి, రుయ్యాడి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. పలుచోట్ల ఎన్నికల విధులపై అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో పార్లమెంట్ పరిధిలోని ఓటింగ్ సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా పరిశీలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలతో పాటు పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ శాంతినగర్‌లోని డిగ్రీ కళాశాలలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ కాషాయ కండువాను వేసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో కాంగ్రెస్ నేత కంది మౌనికారెడ్డి, ముడుపు నళినిరెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దారి తీసింది. అలాగే కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి మహాలక్ష్మివాడ, మావలలో పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లడంతో బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ తన సొంత మండలమైన బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. అదేవిధంగా సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు బోథ్ మండలం ఘన్‌పూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఉట్నూర్ మండల కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి జోగు రామన్న జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో తన అనుచరులతో కలిసి ఓటు వేశారు. అంతేకాకుండా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శాంతినగర్ పుల్తిభౌలి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గండ్రత్ సుజాత కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.






● ఓటు వేసినట్లు చూపుతున్న ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వరుసగా పాయల శంకర్, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్



పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే పాయలతో కంది మౌనారెడ్డి వాగ్వాదం


వీవీ ప్యాట్లకు సీల్ వేస్తున్న సిబ్బంది


జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్న వీవీ ప్యాట్లు

కలెక్టర్ చొరవతో ఓటేసిన బావోజీపేట్ గ్రామస్థులు

ఇచ్చోడ, మే 13: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం, త్రీఫేజ్ ఇవ్వడం లేదని సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు మండలంలోని బావోజీపేట్ గ్రామస్థులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓటు గ్రామంలోని దాదాపు 390 మంది ఓటర్లు ఎవరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లలేదు. తమ సమస్యను పరిష్కరిస్తేనే ఓటేస్తామని చెప్పడంతో.. చివరికి జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. దీంతో మండల అధికారులు బావోజీపేట్‌కు చేరుకుని గ్రామస్థులతో ఈ విషయమై చర్చించారు. తమ గ్రామ సమస్యలు పరిష్కరించేలా చూస్తామని కలెక్టర్ చొరవ చూపడంతో మండల అధికారులు గ్రామస్థులకు నచ్చచెప్పడంతో ఓటు వేశారు. దీంతో గ్రామస్థులు సత్వరమే సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామస్థులు ఎట్టకేలకు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.


మధ్యాహ్నం వరకు నిర్మానుష్యంగా ఉన్న పోలింగ్ కేంద్రం


అధికారుల సమక్షంలో ఓటేసేందుకు బారులు తీరిన గ్రామస్థులు

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● పోలింగ్ బూత్ వద్ద డీఎస్పీ, కాంగ్రెస్, బీజేపీ ఆందోళన

తలమడుగు, మే 13: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసినటువంటి భోజనాన్ని బీఆర్ఎస్ నాయకులతో ఏర్పాటు చేయించి బీఆర్ఎస్ నాయకులతో కలిసి భోజనాలు చేయడాన్ని ఖండిస్తూ ధర్మసమాజ్‌పార్టీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలింగ్ బూత్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ కజ్జర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి బీఆర్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి మొట్టెకిరణ్ కుమార్‌తో వంటలు చయించి భోజనాలు బీఆర్ఎస్ కిరణ్‌కుమార్‌తో కలిసి పోలంగ్ సిబ్బందికి ఒకే చోట ఒకే పార్టీ నాయకులు కలిసి భోజనం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆ పార్టీ కార్యకర్తలాగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శి కస్తూరి శోభరాణిని, గ్రామ కారోబార్ రమాకాంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులకు, గ్రామస్థులకు మధ్య ఘర్షణ వాతావరణం జరిగింది. పోలింగ్ బూత్ ఎదుట గ్రామ వివిధ పార్టీల నాయకులు ఆందోళనలు చేశారు. అనంతరం ఏఎస్పీ, ఎస్సై లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఎన్నికల సెక్టార్ అధికారి తిరుపతి జరిగిన సంఘటనల సంబంధింత ఫొటోలు, వీడియోలను అందించారు. బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది. ఇందులో కాంగ్రెస్ ఎంపీటీసీ గోదావరి కమలాకర్, పార్టీ నాయకులు నించకవి గణేష్, మూడేళ్ల పోశెట్టి, కుమ్మరి సంతోష్, ఎనగంటి శ్రీనివాస్, బీజేపీ నాయకులు శార్తస్వామి, తాండ్రగణేష్, డీఎస్పీ నాయకులు అగ్గిమల్ల నవీన్, రామెల్లి సురేష్‌గొంటిముక్కుల మల్లయ్య, అగ్గిమల్ల సాయి, విజయ్, శ్రీనివాస్, తదితరులున్నారు.


సెక్టార్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, డీఎస్పీ నాయకులు

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన నిర్మల్ ఎస్పీ

భైంసా రూరల్, మే 13 : మండలంలోని మహాగాం గ్రామంలో సోమవారం పోలింగ్ కేంద్రాన్ని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతియుతంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్ర బలగాలతో పాటు స్థానిక సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈమె వెంట సీఐ శ్రీనివాస్, భైంసా రూరల్, ఎస్సై శ్రీకాంత్, పోలీస్ బృందం పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల



క్రాస్ ఓటింగ్ కలవరం

- నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ ఎవరిని ముంచనుందో!?
- భారీగా లాభపడ్డామంటున్న బీజేపీ
- వ్యతిరేక ఓటు తమకు మళ్లిందని కాంగ్రెస్ ఆశలు
- బీఆర్ఎస్‌కు ఏజెంట్లు కరువైన పరిస్థితి

నిర్మల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నిర్మల్ జిల్లాలో ప్రధాన పోరు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నడుమనే కనిపించింది. పట్టణ ప్రాంతాలు, పెద్ద మండల కేంద్రాల్లో బీజేపీ పరిస్థితి ఏకపక్షంగా కనిపించగా, గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ మిశ్రమంగా ఉంది. పోలింగ్ సరళిని బట్టి రెండు పార్టీలు తమకు లాభం చేకూరుస్తాయన్న అభిప్రాయంతో ఉన్నారు. అయితే పూర్తిగా బలహీన పడిన బీఆర్ఎస్ పార్టీ ఎవరికి లాభం చేస్తుందోనన్నది ఇప్పుడు కొత్త చర్చకు దారి తీస్తోంది.

బీజేపీ భారీ ఆశలు

అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఊపుమీదున్న బీజేపీ పార్టీ మళ్లీ నిర్మల్ జిల్లాలో అవే ఫలితాలు వస్తాయన్న ఆశతో ఉంది. నిర్మల్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 50వేలకు పైగా మెజార్టీ రాగా ముథోల్ నియోజకవర్గంలో 25వేల ఓట్ల మెజార్టీ సాధించింది. అయితే ఈ మెజార్టీ ఇంకా పెరిగే అవకాశం ఉందని బీజేపీ భావిస్తోంది. ఇటీవలనే బీఆర్ఎస్ పార్టీని వీడిన అనేక మంది నేతల వెంట ఉన్న కార్యాకర్తలు, సామాన్య ఓటర్లు తమ వైపు మొగ్గు చూపారని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. నేతలంతా కాంగ్రెస్ పార్టీవైపు వెళ్ళగా సైలెంట్ ఓటర్లు తమ వైపు మళ్ళారని ఆ పార్టీ అంచనా వేస్తున్నది. అలాగే స్థానిక పరిణామాలను బట్టి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వైపు నిలబడ్డ మైనార్టీలు ఈ సారి కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్ళడంతో హిందుత్వ ఓటింగ్ తమకు భారీగా లాభం చేకూర్చిందని బీజేపీ విశ్వసిస్తోంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో మైనార్టీలు ఒకవైపు ఇతర సామాజిక వర్గం ఓటర్లు మరోవైపు అన్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఒక రోజు ముందు నుంచే సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కూడా చేయడంతో బీజేపీకి భారీ ఓట్లు పడేలా చేశాయని అంటున్నారు. ఇటీవలి రాహుల్‌గాంధీ సభకు ముందు కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు, భైంసాలో హనుమాన్ దీక్ష పరులపై కేసులు దాని పరియవసానం తమకు భారీగా లాభం చేసిందని బీజేపీ వర్గాలు ఆశలో ఉన్నాయి.

గత బీఆర్ఎస్ ఓట్లు తమకేనని కాంగ్రెస్ పార్టీ ఆశలు...

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ కన్నా మెరుగైన ఫలితాలను సాధించింది. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో రెండో స్థానం ఉంది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహా పెద్దఎత్తున పార్టీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అప్పటి బీఆర్ఎస్ పార్టీ ఓట్లన్ని కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి మళ్ళాయని కాంగ్రెస్ పార్టీ ఆశతో ఉన్నది. అయితే క్రమంగా పుంజుకుంటున్న కాంగ్రెస్ తాజాగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరుల చేరికతో రెండు వర్గాలుగా వీడిపోయిన పరిస్థితులు మరి లాభం చేకూర్చాయా.. నష్టం జరిగేలా చేశాయా అన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ లక్షకు పైగా ఓట్లను సాధించగా.. బీఆర్ఎస్ పార్టీ 57వేలు, కాంగ్రెస్ పార్టీ 30వేల ఓట్లను సాధించాయి. అప్పటి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఓట్లు కలిపి తాజాగా కాంగ్రెస్‌కే మళ్లితే బీజేపీ కంటే అటు ఇటుగా 15వేల నుంచి 20వేల ఓట్లు మాత్రమే వెనకబడతామని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. మరోవైపు రేవంత్ సర్కారు తెచ్చిన కొత్త సంక్షేమ పథకాలు భారీగా ఆకర్షించేవిగా ఉన్నాయని ప్రతికూల పరిస్థితుల్లో బీజేపీ ఉందని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. మరోవైపు.. మంత్రి సీతక్క నిర్మల్ జిల్లాలోనే ఎక్కువగా సమయం కేటాయించి నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా గిరిజన సామాజిక వర్గం ఓట్లను తమకు భారీగా వచ్చేలా చేశాయని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్న విబేధాలు కార్యకర్తలను సైతం రెండుగా చేసిందని దీని ప్రభావం సొంత పార్టీకి నష్టం చేసిందని కూడా చర్చలు మొదలయ్యాయి. పార్టీకి చెందిన సీనియర్ నేత అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీకే చెందిన కార్యకర్తలను తీవ్ర అసహనానికి గురి చేశాయని అంటున్నారు. ఒకవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాగా స్థానిక పరిస్థితులు, నేతల వ్యవహార శైలి కారణంగా తాజా ఎన్నికల ఫలితాలు లాభ నష్టాలను బేరీజు వేసే పరిస్థితి లేదన్న అభిప్రాయం కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఉంది.

కారు ఎవరిని ముంచుతుందో..?

ఇక రెండు పర్యాయాలు అధికారం చెలాయించిన భారతీయ రాష్ట్ర సమితి పార్టీ ఈ ఎన్నికల్లో తీవ్రమైన పరాజయాన్ని చవి చూసేలా కనిపిస్తున్నది. ఈ పార్టీకి అనేక చోట్ల ఏజెంట్లు కూడా లేరు. పోలింగ్ కేంద్రాల ముందర బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు టెంట్లను వేసి తమ మంది మార్బలాన్ని ముందుంచి పోలింగ్ స్టేషన్‌లకు వెళ్ళే ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేయగా.. బీఆర్ఎస్ పార్టీ ఆ దిశగా కనీస చర్యలు తీసుకోలేదు. ఆ పార్టీకి చెందిన ముఖ్యనేతలు, కీలకమైన వ్యక్తులంతా కాంగ్రెస్, బీజేపీ పార్టీలలోకి వెళ్లిపోవడం బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే వచ్చిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి చేయాల్సిన దిద్దుబాటు చర్యలు కూడా ఆ పార్టీ చేపట్టలేదన్న అభిప్రాయాలు కార్యకర్తల్లో ఉన్నాయి. అయితే ఇప్పటికే అనేక మంది నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి వెళ్ళిపోగా పార్టీకి చెందిన సానుభూతి పరులు, ఓటర్లు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువైపు మొగ్గు చూపారన్నది ఆసక్తిగా మారింది. గెలిచిన ఓడినా ఈ పార్టీ ప్రభావం బలంగా ఉంటుందన్న అభిప్రాయాలు రాజకీయ విశ్లేషకుల్లో ఉన్నాయి.



పోల్ చీటీలు అందక .. పోలింగ్ కేంద్రాలు తెలియక


భైంసాలోని పోలింగ్ కేంద్రం వద్ద తమ పేర్ల కోసం ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఓటర్లు

భైంసా, మే 13: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో చోటు చేసుకున్న లోపాలను లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో పునరావృతం కానీయబోమని ప్రకటించిన హామీని అధికారులు అచరణలో అమలు పరచడం లో మరోమారు విఫలమయ్యారు. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో అసెంబ్లీ ఎన్నికల సమస్యలే పునరావృతం అవ్వడంతో ఓటర్లు పడరాని పాట్లు పడ్డారు. ఎక్కడ కూడా సరియైన రీతిలో పోల్ చిట్టీల పంపిణీ జరుగకపోవడం మూలంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియక అవస్థల పాలయ్యారు. తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో తెలుసుకునేందుకు గాను తంటాలు పడ్డారు.

● బీఎల్‌వోల నిర్లక్ష్యంతో సమస్యలు

రెవెన్యూ అధికార యంత్రాంగం ఓటర్లకు పోల్ చిట్టీలను పంపిణీ చేసే బాధ్యతలను అంగన్‌వాడీ కార్యకర్తలైన బీఎల్‌వోలకు అప్పచెప్పారు. సంబంధిత చిట్టీలను పంపిణీ చేసే ప్రక్రియలో బీఎల్‌వోలు నిర్లక్ష్యపూరిత వైఖరి విధానాలను అవలంభించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోల్ చిట్టీల పంపిణీని పూర్తి చేయాలి. అయితే పలు ప్రాంతాల్లో ఆదివారం వరకు కూడా పోల్ చిట్టీల పంపిణీ అర్ధశాతం కూడా జరుగలేదంటే పరిస్థితి ఏ విధంగా చెప్పకుండానే తెలిసిపోతోంది. ఓటర్ల ఇంటి చిరునామలు దొరకడం లేదనే కారణాన్ని చూపుతూ పోల్‌చిట్టీల పంపిణీలో బీఎల్‌వోలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. దీంతో సోమవారం ఓట్లు వేసేందుకు గాను ఓటర్లు పాట్లు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పోల్ చిట్టీలు అందకపోవడం వారికి తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో తెలియక తికమకపడ్డారు. అసక్తి ఉన్న ఓటర్లు తమ తమ కాలనీల పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయించి పోల్‌చిట్టీల కోసం తాపత్రాయ పడ్డారు. మరికొందరు అష్ట కష్టాలు పడి ఇది వరకు తాము ఓటు వేసిన పోలింగ్‌బూత్‌కు వెళ్లి అక్కడ ఉన్న బీఎల్‌వోలను కలిసి ఓటరు జాబితాలను పరిశీలించి పోల్ చిట్టీలను తీసుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● సహాయ కేంద్రాల వద్ద వాగ్వాదాలు

ఓటర్ల సహాయార్థం బీఎల్‌వోల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల వద్ద వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. పోల్ చిట్టీలు రాని ఓటర్లు తాము ఇది వరకు ఓటు వేసిన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి అక్కడ ఉన్న బీఎల్‌వోలతో వాగ్వాదానికి దిగారు. అధికారులు పంపిణీ చేసిన పోల్‌చిట్టీలను తమకు ఎందుకు అందించలేదంటే నిలదీసారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రం లోని సహయ కేంద్రాల వద్ద ఇదే తరహ పరిస్థితులు కనిపించాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలోని సహాయ కేంద్రాల వద్ద గల బీఎల్‌వోల చేతుల్లో సోమవారం పంపిణీ చేయని పోల్‌చిట్టీలు వందల సంఖ్యలో కనిపించాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు. ప్రతి సహయ కేంద్రం ఓటర్లతో కిక్కిరిసిపోయి కనిపించింది.

సౌకర్యాల లేమితో పాట్లు పడ్డ ఓటర్లు

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వసతుల లేమి, సౌకర్యాల కరువుతో ఓటర్లు పాట్లు పడ్డారు. ప్రధానంగా వీల్ చైర్లు తక్కువ సంఖ్యలో ఉండటం మూలంగా ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు అవస్థల పాలయ్యారు. ఒక్కో పాఠశాల ఆవరణలో మూడు నుంచి నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు అక్కడి పోలింగ్ కేంద్రాలకు కేవలం ఒకటి నుంచి రెండు వీల్ చైర్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. దీంతో వృద్దులు, దివ్యాంగులు అవస్థలు పడుతూ తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.





పాచ్చెర పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు

బోథ్, మే 13: సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా వివిధ గ్రామాల కార్యదర్శి పోలింగ్ కేంద్రాల వద్ద మంచి నీటి వసతిని ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. మండే ఎండలో వచ్చేఓటర్లు కోసం పోలింగ్ కేంద్రాల ముందు అధికారులు టెంట్‌లు ఏర్పాటు చేశారు. వృద్ధులను లోపలికి ఓటు వేసేందుకు తీసుకు వెళ్లేందుకు వీల్ చెర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల నిర్వహణ తీరును అధికారులు వెంటనే పరిశీంచారు. కాగా జిల్లా ఎంపీ సోయం బాపూరావు అయన స్వగ్రామమైన ఘన్పూర్ లో ఓటు వేయగా ఎంపీపీ తుల శ్రీనివాస్ సోనాలలో ఓటు వేశారు. భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు చాకటి దశరథ్ ధన్నూర్ గ్రామంలో ఓటు వేశారు. ఈ సారి వివిధ గ్రామాల్లో ఉన్న ఓటర్లు స్వగ్రామాలకు వచ్చి ఓట్లు వేయడానికి ఆసక్తి చూపలేదు.

నేటి నుంచి జొన్నల కొనుగోలు

తాంసి, మే 13: మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొన్నలను నేటి నుంచి మళ్ళీ ప్రారంభించినట్లు సహకార సొసైటీ సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటి వరకు తేదీలు ప్రకటించిన గ్రామాలకు సంబంధించిన రైతులు మాత్రమే జొన్నలను మార్కెట్ యార్డుకు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇతర గ్రామాల వారు తీసుకువచ్చినట్లయితే వారి జొన్నలను తూకం వేయడం జరగదన్న విషయాన్ని గమనించాలని కోరారు. జొన్న రైతులు తేదిల ప్రకారం తమకు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో వ్యాపిస్తున్న వ్యాధులు!!

తాంసి, మే 13 : వాతావరణ పరిస్థితుల ప్రభావమో.. లేక తాగునీటి కలుషితమో తెలియదు గాని మండలంలోని చాలా గ్రామాలలో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా కాళ్లు, కీళ్ల నొప్పులతో పాటు జ్వరంతో పలువురు బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. మండుతున్న ఎండలు ఒక పక్క ఉక్కపోత మరో పక్క జనం ఇబ్బందులకు గురవుతున్నారు. వీటికి తోడు పరిసరాల పరిశుభ్రత కూడా సరిగ్గా లేని కారణంగా దోమల తీవ్రత ఎక్కువైందని అంటున్నారు. పారిశుధ్యం చేపట్టాల్సిన పంచాయితీ అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య సిబ్బంది వ్యాధులు సోకే ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

హోటల్లో దర్శనమిచ్చిన ఓటర్ స్లిపులు

బోథ్, మే 13: ఎన్నికలకు ఒక రోజు ముందు ఓటర్లకు చేరవేయాల్సిన ఓటర్ స్లిపులు పంపిణీ చేయకుండా సోనాల బస్టాండ్ సమీపంలోని హోటల్లో పారవేశారు. గమనించిన కొంతమంది స్థానికులు ఈ స్లిప్పులకు సంబంధించిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ఫోటోలు చెక్కర్లు కొట్టాయి దీంతో పోలింగ్ చిటీలు పంచాల్సిన సిబ్బంది పనితనం బయటపడినట్లు అయింది.


సోనాల గ్రామంలోని హోటల్‌లో పాడేసి ఉన్న ఓటర్ స్లిపులు

గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్

● ఉట్నూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ ● జాతర్లలో ఓటుహక్కును వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ● తలమడుగులో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షకుడు

ఉట్నూర్, మే 13: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల కమిషన్ సోమవారం నిర్వహించిన పోలింగ్ కార్యక్రమంలో ఉట్నూర్ మండల ఓటర్లు ప్రశాంతంగా పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉట్నూర్ మండలంలోని పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ సిబ్బంది ఉదయం 6గంటలకు రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించిన అనంతరం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఘన్‌పూర్ పోలింగ్ స్టేషన్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉట్నూర్‌లోని ఉర్దూ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ బీజేపీ కార్యకర్తలతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్‌లు పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఎలాంటి అలజడులు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

● తలమడుగులో 78శాతం పోలింగ్

తలమడుగు: ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల్లో మగిశాయి. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో 78శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. మండలంలో ఎన్నికల తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షకులు జాదవవివేకాంద జిల్లా ఎస్పీ, తహసీల్దార్ రాజమోహన్లు, ఎంపీడీఓ శేఖర్, ఎంపీవో వినోద్‌కుమార్‌లు పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై ధనశ్రీ పర్యవేక్షించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలోను 43 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించామని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు.

● జైనథ్‌లో 55 పోలింగ్ కేంద్రాలు

జైనథ్: జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల 55 పోలింగ్ కేంద్రాలలో సోమవారం జరిగిన లోక్‌సభ పార్లమెంట్ ఎన్నికలు భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా


ఉట్నూర్‌లోని పోలింగ్ కేంద్రంలో సిరా చుక్క వేయించుకుంటున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో సీఆర్‌ఎఫ్ పోలీసులను మోహరించి 144 సెక్షన్ విధించారు. వాతావరణం మేగావృతం అయి చల్లబడడంతో ఉదయం మందకోడిగా కొనసాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి భారీగా పుంజుకున్నది. బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్నజైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలో 80శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ పేర్కొన్నారు.

సిరికొండ: మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుండి 6 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో ప్రజలు, కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని భీంపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీలకు అధికారులు ఎలాంటి వాహన సౌకర్యం కల్పించకపోవడంతో దాదాపు ఐదు కిలోమీటర్లు కాలినడకన చెమ్మన్‌గుడి గ్రామంలోని పోలింగ్ బూత్‌కి చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. దీంతో ఒకింత అసహనానికి గురయ్యారు. ప్రతీ పోలింగ్ దగ్గర ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్సై నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు.


ఉట్నూర్ మండలం ఘన్‌పూర్ పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్ల బారులు

● తాంసిలో మొరాయించిన ఈవీఎం

తాంసి: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రమైన తాంసిలో ఉన్న 41వ పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మొరాయించింది. దీంతో రెండు గంటలపాటు ఓటు వేసేందుకు వచ్చిన అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. మండలంలో మొత్తం 81. 2 శాతం ఓట్లు పోలయ్యాయి. .


ఓటు వేసి సిరా చుక్క చూపుతున్న సినీ నటుడు అభినవ సర్దార్

ఇంద్రవెల్లి: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వృద్ధ ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మావల: మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కునును వినియోగించుకున్నారు. కాగా, జిల్లాకేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో గల ప్రైమరీ స్కూల్‌లో సినీ నటుడు, బీజేపీ నాయకులు అభినవ్ సర్ధార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుడిహత్నూర్: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

అలాగే, భీంపూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి స్థానిక పోలింగ్ కేం ద్రాల వద్ద పెద్దసఖ్యలో బారులు తీరారు. అంతటా పోలింగ్ ప్రశాంతంగా ముగింసింది.


తలమడుగులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


..పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు


జైనథ్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు


దీపాయిగూడలో ఓటు వేసి బయటకు వస్తున్న జోగు రామన్న


సిరికొండ మండలం చిమ్మన్‌గుడి గ్రామంలో ఓటును వేయడానికి కాలినడకన వస్తున్న భీంపూర్ గ్రామ ఆదివాసీలు


ఇచ్చోడలోని ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించిన యువకులు, గ్రామస్థులు

పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్లు


కుంటాల మండలంలో క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు


ఖానాపూర్ శాంతినగర్‌లో ఓటు వేసిన భుక్యా జాన్సన్ నాయక్



దిమ్మదుర్తిలో ఓటు వేసిన నిర్మల్ జడ్పీ చైర్మన్ దంపతులు

నిర్మల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో.. మండలం కేంద్రంలో పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రోత్సాహం.. అధికార యంత్రాంగం చేయూత ఏర్పాట్లు జిల్లాలోని గ్రామీణ ఓటర్లలలో ఉత్సాహాన్ని నింపాయి. దీంతో పోలింగ్ శాతం పెరిగింది.18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు భారీ సంఖ్యలో ఓట్లు వేశారు. అనంతరం పోలింగ్‌స్టేషన్ బయటకు వెళ్లి సెల్ఫీలు దిగారు.

కుంటాల, మే, 13 : కుంటాల మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుండే మండలంలోని అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు క్యూలైన్లలో బారులు తీరారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని లింబా(కే) గ్రామంలో వ్యవసాయ నేపథ్య పోలింగ్ స్టేషన్ (టీ మ్యాటిక్ పోలింగ్ స్టేషన్) ఎంపిక కావడంతో ఈ పోలింగ్ కేంద్రాన్ని పచ్చని తోరణాలతో అలంకరించారు. అంతేగాకుండా వరి కుచ్చులతో పక్షులకు ఆహారాన్ని సైతం ఏర్పాటు చేశారు. సోమవారం డీఆర్‌డీవో విజయలక్ష్మీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి ఓటు వేయడానికి వచ్చిన వారితో మాట్లాడి ఓటు ప్రాధాన్యత తెలియజేశారు. ఓటు ఎంతో ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా రైతులతో, సిబ్బందితో డీఆర్‌డీవో మాట్లాడి ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు.

ఖానాపూర్ : ఖానాపూర్‌లోని శాంతినగర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి భుక్యా జన్సాన్‌నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్యం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో సెల్ఫీ పాయింట్ ఆకట్టుకుంది. పలువురు తమ ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఈ సెల్ఫీ పాయింట్ వద్ద వచ్చి ఫోటోలు దిగుతూ సందడిగా గడిపారు. అధికారులు ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోని పోలింగ్‌బూత్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద తాము ఓటు వేసిన సింబల్ చూపుతూ ఫోటోలు దిగుతూ కొత్త అనుభూతిని పొందినట్లు ఓటర్లు తెలిపారు.

మామడ : మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన దిమ్మదుర్తిలో జిల్లా పరిషత్ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి రామ్‌కిషన్ రెడ్డి, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమవంతుగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుండి ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొని ఓటును వేశారు. ఎన్నికల్లో 75 శాతం ఓట్లు పోలైనట్లు మండల ఎన్నికల అధికారి తెలిపారు.

పెంబి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఎంపీ ఎన్నికలు అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం పోలింగ్ 76.34 శాంత జరిగింది. పోలింగ్ బూత్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పెంబి ఎస్సై శంకర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పెంబి మండలంలోని పెంబి తండా గ్రామానికి చెందిన ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థి భూక్యా జేవంత్ రావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పెంబి జడ్పీటీసీ జానుబాయి తమ ఓటు హక్కును వినియోగించుకుంది.

ముథోల్ : ముథోల్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుండి రాత్రి వరకు ఓటర్లు తమ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. అయితే ముథోల్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 72.73 శాతం పోలింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 311 పోలింగ్ కేంద్రాలకు గాను ముథోల్ నియోజకవర్గంలో మొత్తం 2,54,579 ఓటర్లు ఉన్నారు. అయితే సాయంత్రం వరకు 1,85,253 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే 72.73 శాతం నమోదైంది. అన్ని బూత్‌ల వివరాలు వచ్చిన తర్వాత మొత్తం ఎంత పోలింగ్ శాతం నమోదైందో తెలియాల్సి ఉంది. అన్ని పోలింగ్ బూత్‌ల వివరాలు వస్తే పోలింగ్ శాతం పెరుగనుంది.

మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. మండలంలోని చించాల గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో సుమారు 35 నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఓటు హక్కు వినియోగించేందుకు ఓటర్లు బారులుతీరి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం మండలంలోని రువ్వి గ్రామంలో తెలంగాణ జన సమితి ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం వరకు మందకోడిగా కొనసాగిన ఓటింగ్ శాంతం మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

తానూర్ : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. సాయంత్రం ఆరు గంటల వరకు ఓటర్లు క్యూలైన్‌లలో నిలుచొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై లోకం సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

భైంసా, మే 13 : పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారువ . భైంసా పట్టణంలోని 130 వ పోలింగ్ కేంద్రంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి బోస్లే మోహన్‌రావ్ పాటిల్, బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు విలాస్ గాదేవార్‌లు 136 పోలింగ్ కేంద్రంలో, మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్ 143వ పోలింగ్ కేంద్రంలో, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి దేగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో. జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యామ్ సుందర్ లోకేశ్వరం మండలంలోని పిప్రి పోలింగ్ కేంద్రంలో , బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు డా. కిరణ్ కోమ్రేవార్ కుభీర్ మండలంలోని నిగ్వా పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

భైంసా రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఓటు హక్కును దేగాం గ్రామంలో వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మందకొడిగా సాగిన ఎన్నికలు మధ్యాహ్నం 12 తర్వాత ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని ఉర్దుమీడియం పాఠశాలలో ఈవీఎం 30నిమిషాల పాటు మోరాయించింది. మండల వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల వరకు 73.42శాతం ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ సోము తెలిపారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న జడ్పీటీసీ జానుబాయి


తానూర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి వస్తున్న వృద్ధురాలు


భైంసాలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు



andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5; కనిష్ఠం 26.8



నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 14 మే 2024

పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బందికి

నేడు ప్రత్యేకసెలవు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 13 : ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి మంగళవారం ప్రత్యేకసెలవు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషనర్ ఆదేశం మేరకు ఈ సెలవు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో విధులు నిర్వహించినట్టు డ్యూటీ సర్టిఫికెట్ చూపించి ఈ సెలవు వినియోగించుకోవాలన్నారు. ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి




దిమ్మదుర్తిలో ఓటు హక్కును వినియోగించుకున్న డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు



భైంసాలో.. ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



ఖానాపూర్‌లో.. మున్సిపల్ చైర్మన్ సత్యం



.. మాజీ మంత్రి ఐకే రెడ్డి



ఓటు వేసిన రాజవ్వ (90)

ప్రశాంతంగా పోలింగ్



ఓటు వేసి చుక్క చూపుతున్న కలెక్టర్

జిల్లా కేంద్రంలోని కస్బా పోలింగ్ కేంద్రంలో నాంపల్లి నర్సవ్వ ఓటు వేరొకరు వేసిపోగా ఈ వృద్ధురాలు టెండర్ ఓటు వినియోగించుకున్నారు

- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ
- ఉదయం నుంచే కేంద్రాలకు ఓటర్లు
- సాయంత్రం 5 వరకు 70.48 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- ఉత్సాహంగా పాల్గొన్న వయోవృద్ధులు

నిర్మల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఉత్సాహంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం గతంలో కంటే పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో 70.48 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా శాంతియుతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకీషర్మిల సందర్శించారు. నిర్భయంగా ఓటు వేయాలని ఓటర్లను కోరారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గంలోని కేంద్రాలు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డితో పాటు పలు రాజకీయ పార్టీల ప్రముఖులు తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు

జిల్లాలో 90 ఏళ్ల పైబడిన వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలువురు టెండర్ ఓటు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్ సౌకర్యం కల్పించారు.

సాయంత్రం 5 వరకు 70.48 శాతం పోలింగ్

జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 70.48 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నమోదైన ఓటింగ్ శాతం ఈ విధంగా ఉంది. ఉదయం 9 గంటలకు నిర్మల్‌లో 12.40, ముథోల్‌లో 13.35, ఖానాపూర్‌లో 16.28 శాతం ఓటింగ్ జరిగింది. ఉదయం 11 గంటలకు నిర్మల్‌లో 30.09, ఖానాపూర్‌లో 30.33, ముథోల్‌లో 31.60 శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంటకు జిల్లాలో 50.15 శాతం నమోదైంది. ముథోల్ 50.58, ఖానాపూర్ 49.64, నిర్మల్ 48.49 శాతం నమోదైంది. మధ్యాహ్నం 3 గంటలకు 62.11 శాతం నమోదు కాగా ఖానాపూర్ 60.24, ముథోల్ 63.34, నిర్మల్ 60.70 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటలకు జిల్లాలో 70.48 శాతం నమోదు కాగా ఖానాపూర్‌లో 37.02, నిర్మల్ 69.03, ముథోల్ 72.73 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నిర్మల్ కల్చరల్ : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలోని 237 పోలింగ్‌కేంద్రంలో ఉదయం ఓటు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యం కల్పించిన గొప్ప వరమన్నారు.

నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గాజులపేటలోని 192 పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ బాగుల వాడ శిశుమందిర్‌లోని 239 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం సొంత గ్రామం ఎల్లపెల్లిలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు.

సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ వి. శోభారాణి తన భర్త బీజేపీ నాయకుడు సత్యనారాయణగౌడ్‌తో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నిర్మల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన ఈర్ల రాజవ్వ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. గత కొన్ని సంవత్సరాల క్రితం కాలు విరిగిన రాజవ్వ ఓటు వేయాలన్న సంకల్పంతో పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్‌లో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

టెండర్ ఓటు వేసిన మహిళ

నిర్మల్ పట్టణం కస్బా పోలింగ్ కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓ మహిళ ఓటు వేరొకరు వేసిపోగా ఆమె టెండర్ ఓటు వినియోగించుకుంది. నాంపల్లి నర్సవ్వ అనే మహిళ పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే ఆమె ఓటు వేయడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అధికారులు ఆమెకు టెండర్ ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో ఆమె ఓటు హక్కు ఉపయోగించుకుంది.

కాల్వలో మొరాయించిన ఈవీఎం

దిలావర్‌పూర్ : మండలంలోని కాల్వలో 268వ పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మొరాయించింది. దీంతో అధికారులు నిర్మల్ నుంచి మరో ఈవీఎంను తెప్పించారు. కొత్త ఈవీఎంను మార్చేందుకు సుమారు గంట సమయం పట్టింది. దీంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. వృద్ధులు, మహిళలు, యువకులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా స్ట్రెచర్లను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా మహిళలు ఓటు వేసేందుకు ఉదయం నుంచే క్యూలో నిల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల దిలావర్‌పూర్‌లోని పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

దస్తూరాబాద్‌లో 73.1 శాతం ఓట్ల నమోదు

దస్తూరాబాద్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓటర్లకు సౌకర్యాలను కల్పించారు. మండలంలో మొత్తం ఓటర్లు 12,795 ఉన్నారు. 73.1 శాతం ఓట్లు నమోదయ్యాయి.

ఖానాపూర్ : ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు. తమ తమ పార్టీలకు ఓటు వేయాలని ఆయా పార్టీల నాయకులు పోలింగ్ బూత్ నియంత్రణ రేఖ అవతలి వైపు నిలబడి ఓటర్లకు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. మండలంలోని గోసంపల్లె, రాజుర, అడవి సారంగాపూర్ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

వెలవెలబోయిన ప్రయాణ ప్రాంగణాలు

- పోలింగ్ కోసం స్వంత ప్రాంతాలకే పరిమితమైన ఓటర్లు
- నామమాత్రంగా ప్రయాణీకుల రాకపోకలు
- బోసిపోయిన బస్సులు



బోసిపోయి కనిపిస్తున్న భైంసా ప్రయాణీకులు ప్రాంగణం

భైంసా, మే 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిత్యం ప్రయాణీకులతో సందడిగా కనిపించే జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాలు సోమవారం వెలవెల బోయి కనిపించాయి. క్రిక్కిరిసిపోయిన ప్రయాణీకులతో రద్దీగా కనిపించే బస్సులు బోసిపోయి దర్శనమిచ్చాయి. ఓటర్లందరూ పోలింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు గాను తమ తమ ప్రాంతాలకే పరిమితమవ్వడం మూలంగా ఆర్‌టీసీ బస్సులలో ప్రయాణీకుల ప్రయణాలు నామమాత్రంగా జరిగాయి. రోజు వందలాది మంది ప్రయాణీకుల రాకపోకలు జరిగే వివిధ రూట్లలో పదుల సంఖ్యలో ప్రయాణీకులు ప్రయణాలు జరుగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది.

● నామమాత్రంగా ప్రయాణికులు రాకపోకలు

ఓటు వేసేందుకు గాను వివిధ ప్రాంతాల్లోనునున్న ఓటర్లందరూ శని, ఆదివారాల్లోనే తమ తమ స్వస్థలాలకు తరలివచ్చారు. ఇక ఓటింగ్ రోజును పురస్కరించుకొని సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండటంతో వివిధ పనుల నిమిత్తం మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు వెళ్లే వారు తమ ప్రయాణాలను విరమించుకున్నారు. మార్కెట్ల పరిధిలో క్రయ, విక్రయాలు నామమాత్రంగానే జరుగుతాయన్న ముందు చూపుతో వినియోగదారులు సైతం ప్రయాణాలను రద్దు చేసుకొని స్వంత ప్రాంతాలకే పరిమితమయ్యారు. దీంతో బస్సులలో ప్రయాణీకుల రాకపోకలు నామమాత్రంగా జరిగాయి. పలు రూట్లలోని బస్సులలో పదిలోపు మందే ప్రయాణికులు ప్రయాణించారు. ప్రయాణికులు అంతంత మాత్రంగానే ప్రయణాలు చేపట్టడంతో బస్సులో బోసి కనిపించాయి.

ప్రయాణీకుల రాకపోకలతో రద్దీగా కనిపిస్తూ కళకళలాడే ప్రయాణ ప్రాంగణాలు వెలవెలబోయి కనిపించాయి. పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను తమ స్వగ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన ప్రాంతాలకే ఓటర్లు పరిమితమయ్యారు. దీంతో ప్రయాణీకులు తక్కువ సంఖ్యలో ఉండటం మూలంగా కళకళలాడుతూ కనిపించే ప్రయాణ ప్రాంగణాలు బోసిపోయి కనిపించాయి.



సీట్లన్నీ ఖాళీ.. బస్సులో ప్రయాణీకులకు టికెట్లను ఇస్తున్న కండక్టర్

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ : ఎస్ఈ బి. శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, మే 13 : జిల్లాలో ఆదివారం రాత్రి అకాల వర్షం కురిసి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా యుద్ధ ప్రాతిపదికన సరఫరా పునరుద్ధరించామని ఎస్ఈ బి. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో 33 ఫీడర్లలో 3 బ్రేడ్ డౌన్, 11 కేవీ ఫీడర్ పరిధిలో 6 బ్రేడ్ డౌన్లు ఏర్పడ్డాయన్నారు. రెడు ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయన్నారు. ఎన్నికలకు అంతరాయం కలుగకుండా సిబ్బంది శ్రమించి పునరుద్ధరించారన్నారు. సిబ్బందిని అభినందించారు.

కనీస సౌకర్యాలు కల్పిస్తేనే ఓటేస్తాం

- కడెం మండలం అల్లంపెల్లిలో ఎన్నికలను బహిష్కరించిన గ్రామస్థులు
- అదనపు కలెక్టర్ సహా జిల్లా అధికారుల బుజ్జగింపుతో తిరిగి ఓట్లు వేసిన వైనం



అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ఖానాపూర్, మే 13 : తమ గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పిస్తేనే ఓట్లు వేస్తామని లేకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని కడెం మండలం అల్లంపెల్లి, బాబానాయక్ తండా గ్రామస్థులు సోమవారం ఉదయం ఎన్నికలను బహిష్కరించారు. దీంతో మండల స్థాయి అధికారులు గ్రామానికి చేరుకుని గ్రామస్థులను బుజ్జగించారు. అయినప్పటికీ ఓటు వేసేందుకు వారు ససేమిరా అన్నారు. మధ్యాహ్నం వరకు కూడా తాము ఓట్లు వేసేందుకు లేదని రెండు గ్రామాల ప్రజలు పట్టు పట్టడంతో మండల స్థాయి అధికారులు జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం అందజేశారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఏఎస్పీ సూర్యనారాయణ, ఇన్‌చార్జి డీఎస్పీ రమణ మూర్తి, తదితరులు అల్లంపెల్లి గ్రామానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి వారిని సముదాయించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామస్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలపడంతో తిరిగి గ్రామస్థులంతా యథావిధిగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామాల్లో ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం నుంచి సజావుగా సాగింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు

నిర్మల్ కల్చరల్, మే 13 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్మల్ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. సోమవారం ఆమె మాటాడుతూ... పోలింగ్ పరికరాలు, సిబ్బందిని సురక్షితంగా కేంద్రాలకు తీసుకెళ్లామన్నారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మూడంచెల భద్రత కల్పించామన్నారు. ఆకస్మిక వాహన తనిఖీలు, బైక్ పెట్రోలింగ్, స్ట్రైకింగ్ ఫోర్స్ టీములుగా విభజించి క్విక్ రియాక్షన్ టీములు ఏర్పాటు చేశామన్నారు. సమన్వయంతో ఎన్నికలు విధులు నిర్వహించడం కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బంది తీరు అభినందనీయమన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినట్లు వివరించారు.



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ

● అనుక్షణం అప్రమత్తం

భైంసా : డివిజన్ పరిధిలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలీసు అధికార యంత్రాంగం చేపట్టిన ప్రణాళికబద్ధమైన భద్రతా చర్యల నేపథ్యంలో చిన్నపాటి చెదురు,ముదురు ఘటనలకు సైతం ఆస్కారం లేకుండా ఓటింగ్ ప్రక్రియ ఆద్యాంతం సజావుగా కొనసాగింది. డివిజన్ పరిధిలో మొత్తం 311 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 52 కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించిన అధికారులు సంబంధిత కేంద్రాల బందోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 23 కేంద్రాలు ఒక భైంసా పట్టణ పరిధిలోనే ఉండటంతో పోలీసు అధికార యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించారు. దీనికి తోడు ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భైంసాలో రోడ్ షో నిర్వహించిన సందర్భంగా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీసు అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు గాను పకడ్బందీగా వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉండేందుకు గాను ముందస్తు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు బలగాల ద్వారా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు చేపట్టారు. పట్టణ పరిధిలోని సమస్యాత్మక, వివాదస్పద ప్రాంతాల్లో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. బ్లూకోట్ పోలీసులు అనుక్షణం పట్టణ పరిధిలో కలియ తిరుగుతూ భద్రతను చేపట్టారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డి , రూరల్ సీఐ శ్రీనివాస్ , ముథోల్ సీఐ మల్లేష్ లతో పాటు డివిజన్ పరిధిలోని ఎస్ఐలు చేపట్టిన కట్టుదిట్టమై బందోబస్తుతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.



భైంసాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



భైంసాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఐటీబీ పోలీసులు

సంక్షిప్త సమాచారం

విద్యుత్ షాక్‌తో

పశువులు మృతి



మృతి చెందిన పశువులు

పెంబి, మే 13 : విద్యుత్ షాక్ తగిలి మూడు పశువులు, ఒక కుక్క మృతి చెందిన సంఘటన తులసిపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని తులసిపేట్ గ్రామంలో ఆదివారం రాత్రి భారీ వర్షం, గాలి రావడంతో విద్యుత్‌వైర్లు తెగి పొలంలో వేసిన కంచెపై విద్యుత్ వైర్లు తెగి పడడంతో సోమవారం అటువైపు మేత మేస్తూ వెళ్లడంతో విద్యుత్‌షాక్ తగిలి మూడు పశువులు, ఒక కుక్క చనిపోయినట్లు తెలిపారు. పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన దస్ సింగ్, దేవ్ సింగ్, తులసిపేట్ గ్రామానికి చెందిన గంగయ్య పశువులు మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన పశువులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



.. గేదె మృతి

ఖానాపూర్, మే 13 : మండల కేంద్రంలోని పద్మావతి నగర్ కాలనీకి చెందిన చోట నవీన్ అనే పాడి రైతుకు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే రోజువారీగా సోమవారం ఉదయం మేత కోసం అడవికి వెళ్లిన గేదె ఖానాపూర్ శివారులో తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని బాధితుడు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన ఈ ప్రమాదానికి తనకు సుమారు 70 వేల రూపాయల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నారు. తనకు జరిగిన నష్టానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. తాను పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నానని ప్రస్తుతం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందడంతో తన జీవనాధారం దెబ్బతిందని రైతు నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె